



యశోదకు అవ్వైయ్యార్ అవార్డు ప్రదానం చేస్తున్న సీఎం

మాజీ వీసీ యశోదకు 'అవ్వైయార్' అవార్డు

ప్రదానం చేసిన సీఎం స్టాలిన్

రూ.72 కోట్లతో 'తోళి విడిది'

ఘనంగా మహిళా దినోత్సవం

చెన్నై, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి కోసం అత్యుత్తమ సేవలందిస్తున్న అన్నై థెరిస్సా ఉమెన్స్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ యశోదా షణ్ముగసుందరానికి 'అవ్వైయార్' అవార్డును ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శనివారం ప్రదానం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని స్థానిక పెరియమేట్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించారు.. ఈ వేడుకల్లో సీఎం స్టాలిన్ పాల్గొని, మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. రూ.2.41 కోట్ల విలువైన 50 ఎలక్ట్రిక్ ఆటోలను పంపిణీ చేశారు. అలాగే, విదేశీ విద్యను అభ్యసించేందుకు వీలుగా ఎస్సీ,ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన ఐదుగురు మహిళలకు రూ.10 లక్షల ఆర్థికసాయం, భూమి కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ రాయితీగా రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.25 లక్షలను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఎం ప్రసంగిస్తూ.. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న నేరాలు, ఘోరాలను అరికట్టేందుకు, వారి రక్షణ కోసం సేఫ్టీ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించినట్టు గుర్తు చేశారు. ఈ తరహా రిజర్వేషన్లు కల్పించడం వల్ల 70 శాతం మహిళలు ఎన్నికల్లో విజయం సాధించడంతో పాటు మహిళా స్వయం సహాయక బృందాల్లో సభ్యులుగా ఉన్నారన్నారు. వర్కింగ్ ఉమెన్స్ కోసం 'తోళి విడుది' (ఫ్రెండ్‌షిప్ హాస్టల్స్)ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటికి రాష్ట్రం నలుమూలల నుంచి భారీ స్పందన వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా 9 నగరాల్లో రూ.72 కోట్లతో తోళి విడిదులను అందుబాటులోకి తీసుకురానున్నట్టు ప్రకటించారు. ముఖ్యంగా, ఈ హాస్టళ్లను కొత్తగా కాంచీపురం, ఈరోడ్, ధర్మపురి, శివగంగై, తేని, కడలూరు, నాగపట్టినం, రాణిపేట, కరూర్ ప్రాంతాల్లో నిర్మిస్తామన్నారు. ఇందుకోసం రూ.70 కోట్లను ఖర్చుచేసి, 700 పడకల సౌకర్యంలో స్థాపిస్తామన్నారు. 24 గంటల పాటు రక్షణతో పాటు బయోమెట్రిక్, వైఫై సౌకర్యం, శుద్ధీకరించిన తాగునీరు వంటి సౌకర్యాలు ఉంటాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 34,073 స్వయం సహాయక బృందాలకు చెందిన 4,42,949 మందికి రూ.3,190 కోట్ల రుణాలను మంజూరు చేశామన్నారు. అదేవిధంగా చెన్నైలో మహిళా భద్రతలో భాగంగా, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో లక్ష రూపాయల రాయితీతో 250 మంది మహిళలకు పింక్ ఆటోలను అందజేసినట్టు తెలిపారు. ఈ ఆంటోలన్నింటినీ పోలీస్ కంట్రోల్ రూంకు జీపీఎస్ సౌకర్యంతో అనుసంధానం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు గీతా జీవన్, సుబ్రహ్మణ్యం, పీకే శేఖర్ బాబు, సీవీ షణ్ముగం, కయల్‌విళి సెల్వరాజ్, నగర మేయర్ ఆర్.ప్రియ, ఎంపీలు తమిళిచ్చి తంగపాండ్యన్, కళానిధి వీరాస్వామి, పలువురు ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



మహిళా ఆటో డ్రైవర్‌తో మాట్లాడుతున్న సీఎం స్టాలిన్

చెన్నైలో 'పింక్ ఆటో'లు

● ప్రారంభించిన సీఎం స్టాలిన్

ప్యారీస్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాజధాని నగరం చెన్నైలో శనివారం ఉదయం 'పింక్ ఆటో' సేవలను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. సుశిక్షితులైన, ప్రభుత్వ గుర్తింపు పొందిన మహిళలు నడిపే ఈ పింక్ ఆటోలు మహిళల భద్రతకు భరోసానిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలో మహిళల భద్రత కల్పించడం, మహిళలకు జీవనోపాధి తదితరాలు పరిగణలోకి తీసుకున్న రాష్ట్రప్రభుత్వం 'పింక్ ఆటో' పథకం అమలు చేయనున్నట్లు గత ఏడాది జూన్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి గీతాజీవన్ ప్రకటించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ప్రభుత్వం 250 పింక్, ఎల్లో, బ్లూ రంగు ఆటోలను ప్రత్యేకంగా డిజైన్ చేయించింది. ఈ నేపథ్యంలో 250 మంది మహిళలకు రూ.లక్ష సబ్సిడీతో 250 ఆటోలు జీపీఎస్ పరికరాలు, అత్యాధునిక వసతులతో రూపుదిద్దుకున్నాయి. శనివారం ఉదయం 10గంటలకు సెంట్రల్ రైల్వేస్టేషన్ సమీపంలోని నెహ్రూ ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో పింక్ ఆటో పథకాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలి దశలో 100పింక్ ఆటోలు, 100ఎల్లో, 50 బ్లూ రంగు ఆటోలను సీఎం మహిళలకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన స్వయంగా ఆటో డ్రైవర్లతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, రాష్ట్రమంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

మహిళలకు భద్రత కల్పించలేని ఈ ప్రభుత్వాన్ని

మార్చేద్దాం

● టీవీకే అధినేత విజయ్ పిలుపు

● ఆయనది మీడియా పబ్లిసిటీ

● మంత్రి కేఎన్ నెహ్రూ ధ్వజం



చెన్నై, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళలకు భద్రత కల్పించలేని డీఎంకే ప్రభుత్వాన్ని మార్చేయాలని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) అధినేత, ప్రముఖ నటుడు విజయ్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన శనివారం వీడియో విడుదల చేశారు. "నేడు మహిళా దినోత్సవం. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అమ్మలు, అక్కలు, చెల్లెళ్లు, స్నేహితురాళ్ల అందరికీ ఈ రోజు శుభాకాంక్షలు తెలపకుండా ఉండలేం. మీ అందరికీ మహిళా దినోత్సవ శుభకాంక్షలు. సంతోషమే కదా. భద్రంగా ఉంటేనే కదా మీరు సంతోషంగా ఉండగలరు. అలాంటి భద్రతే లేనప్పుడు, అభద్రతా భావంతో ఉన్నప్పుడు ఎలాంటి సంతోషమూ ఉండదు కదా! మీరంతా అలా అనుకుంటున్నారని నాకు అర్థమవుతూనే ఉంది. ఏం చేయను.. మీరు, మనమూ అందరూ కలిసే కదా ఈ డీఎంకే ప్రభుత్వాన్ని ఎంచుకున్నాం. వాళ్లంతా ఇలా మోసగిస్తారని ఇప్పుడే కదా తెలుస్తోంది. ఇక్కడ అంతా మారుతోంది. మార్పు తప్పదు కదా! మహిళలకు భద్రత కల్పించలేని ఈ ప్రభుత్వాన్ని 2026లో మనమంతా కలిసి మార్చేద్దాం. ఆ లక్ష్య సాధన కోసం మహిళా దినోత్సవం సందర్భంగా మనమంతా శపథం చేద్దాం. మీకో విషయాన్ని మాత్రం చెప్పదలచుకున్నా. అన్ని పరిస్థితుల్లో మీ కొడుకులా, అన్నయ్యలా, తమ్ముడిలా, స్నేహితుడిలా అండగా ఉంటా అని ప్రతిజ్ఞ చేస్తున్నా" అంటూ విజయ్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్ అవుతోంది.

మాది మహిళా ప్రభుత్వం

● మంత్రి కేఎన్ నెహ్రూ

విజయ్ ప్రకటనపై డీఎంకే సీనియర్ నేత, రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ స్పందించారు. శనివారం ఆయన తిరుచ్చిలో మీడియాతో మాట్లాడుతూ.. విజయ్ కేవలం మీడియా పబ్లిసిటీ కోసమే ఈ ప్రకటన చేశారని ధ్వజమెత్తారు. డీఎంకేది మహిళా ప్రభుత్వమని, మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వివరించారు. ఈ విషయాలను పక్కనబెట్టి మహిళలకు భద్రత లేదని ఆరోపణలు చేయడం విజయ్‌కు ఏమాత్రం మంచిది కాదని హితవు పలికారు.

ఎడప్పాడి వ్యాఖ్యలపై ప్రేమలత 'నో కామెంట్'



ప్రేమలతను సన్మానిస్తున్న మహిళా విభాగ కార్యకర్తలు

అడయార్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సీటు కేటాయింపుపై డీఎండీకేతో ఎలాంటి ఒప్పందం కుదుర్చుకోలేదంటూ అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామి చేసిన వ్యాఖ్యలపై స్పందించేందుకు డీఎండీకే అధ్యక్షురాలు ప్రేమలత నిరాకరించారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక కోయంబేడులోని డీఎండీకే ప్రధాన కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు జరిగాయి. ఈ వేడుకల్లో ప్రేమలత పాల్గొని, కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ.. పార్టీలోని మహిళా విభాగానికి యూనిఫాం అందించిన ఘనత కెప్టెన్ విజయకాంత్‌కే చెల్లుతుందన్నారు. ఆయన పైలోకంలో దేవుడుగా ఉంటూ మనల్ని ముందుకు నడిపిస్తున్నారన్నారు. ఓ కాలేజీలో తనకు ప్రదానం చేసిన జీవిత సాఫల్య పురస్కారాన్ని పార్టీ మహిళా విభాగానికి అంకితమిస్తున్నట్టు తెలిపారు. మహిళా దినోత్సవం రోజున కెప్టెన్ లక్ష్యాలు, కలల్ని సాధించేందుకు ప్రతి ఒక్కరం కలిసికట్టుగా కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించాని ఆమె కోరారు. త్రిభాషా విధానంపై తమ అభిప్రాయాన్ని ఇప్పటికే వ్యక్తం చేశామన్నారు. కెప్టెన్ నినాదం మేరకు మాతృభాషను పరిరక్షించుకుంటూ అన్ని భాషలను నేర్చుకుందామన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన సమయంలో రాష్ట్రానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా కేంద్రం చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. మరోవైపు, రాజ్యసభ సీటు కేటాయింపు వ్యవహారంలో అన్నాడీఎంకే, డీఎండీకే మధ్య ఎలాంటి కుదుర్చుకోలేదంటూ మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి చేసిన వ్యాఖ్యలను మీడియా ప్రస్తావించగా, ఈ వ్యాఖ్యలపై ప్రేమలత స్పందించేందుకు నిరాకరించారు.





పావురాన్ని ఎగరవేస్తున్న ఎడప్పాడి పళనిస్వామి - మహిళలకు కేక్ అందజేస్తున్న ఈపీఎస్

స్త్రీల సహకారంతోనే మళ్లీ మన ప్రభుత్వం

మహిళా దినోత్సవంలో ఈపీఎస్ ధీమా

ప్యారీస్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళా శక్తి సహకారంతో 2026లో రాష్ట్రంలో అన్నాడీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ధీమా వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రాయపేటలోని అన్నాడీఎంకే కార్యాలయం ఎంజీఆర్ మాళిగైలో శనివారం వేడుకలను కోలాహలంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో పాల్గొన్న ఎడప్పాడి పళనిస్వామి కార్యాలయ ప్రాంగణంలో దివంగత మాజీ ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలితల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పెద్దసంఖ్యలో తరలివచ్చిన మహిళా కార్యకర్తల కరతాళ ధ్వనులు, మేళతాళాల మధ్య ఎరుపు, తెలుపు, నలుపు రంగు బెలూన్లు, పావురాళ్లను ఎగరవేశారు. అనంతరం ప్రత్యేకంగా తయారు చేయించిన 77కిలోల కేక్‌ను ఈపీఎస్ కట్‌చేసి, పార్టీ మహిళా విభాగం నిర్వాహకులకు పంచిపెట్టారు. మాజీమంత్రి వలర్మతి నేతృత్వంలో పేద కుటుంబాలకు చెందిన 29మంది మహిళలకు కుట్టు మెషిన్లు, వెయ్యిమందికి చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళలనుద్దేశించి ఎడప్పాడి మాట్లాడుతూ... మూడుసార్లు ముఖ్యమంత్రిగా వ్యవహరించిన జయలలిత మహిళల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాల ద్వారా లక్షలాది మంది మహిళలు లబ్ధిపొందారని అన్నారు. మహిళామణులు దేశానికి రెండు కళ్ల లాంటివారని భావించిన జయ మహిళా సాధికారతకు ఎనలేని కృషిచేశారని కొనియాడారు. మహిళలు సామాజిక, ఆర్థిక, విద్యా, పారిశ్రామిక రంగాల్లో రాణించేలా కృషి చేసి చరిత్రలో నిలిచిపోయారని తెలిపారు. భ్రూణ హత్యలు అడ్డుకోవాలనే సంకల్పంతో ఊయల పథకం, ఆడపిల్లల సంరక్షణ పథకం, ఉద్యోగాలు చేస్తున్న మహిళలకు అమ్మాద్విచక్రవాహనాల పంపిణీ పథకం, అమ్మా గిఫ్ట్ ప్యాక్ పథకం, చదువుకున్న యువతకు వివాహ ఆర్థిక సాయం, ఉచిత మంగళసూత్రం పథకంతో పాటు మహిళాభివృద్ధికి గత అన్నాడీఎంకే ప్రభుత్వం విజయవంతంగా అమలుపరచిన పథకాలను ప్రస్తుతం అధికారంలోవున్న డీఎంకే అటకెక్కించిందని వ్యాఖ్యానించారు. ఈ డీఎంకే ప్రభుత్వం చేతకాని తనంవల్ల రాష్ట్రంలో అవినీతి, లంచం, దౌర్జన్యాలు, దొంగతనాలు, అక్రమాలు, మహిళలపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు, మాదకద్రవ్యాల వినియోగం, రౌడీయిజం పెరిగాయని, వీటికి స్వస్తి చేప్పాల్సిన బాధ్యత మహిళలదేనని ఉద్ఘాటించిన ఈపీఎస్, 2026లో మహిళల ఆదరణతో మళ్లీ అన్నాడీఎంకే పగ్గాలు చేపడుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ వేడుకల్లో మాజీమంత్రి గోకుల ఇందిర, ఎమ్మెల్యే మరగదం కుమరవేల్, మహిళా విభాగం సంయుక్త కార్యదర్శి నటి గౌతమి సహా పార్టీ నిర్వాహకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరునెల్వేలి ప్రొఫెసర్ విమలకు సాహిత్య అకాడమీ అవార్డు





ప్రొఫెసర్ విమల

టి.నగర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తమిళ భాషలో అత్యుత్తమ అనువాదానికి గాను తిరునెల్వేలి సెయింట్ జవేరియా కళాశాల తమిళ శాఖ అధ్యాపకురాలు పి.విమల సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపికయ్యారు. ఈమె మలయాళ రచయిత నళిని జమీలా రచించిన 'ఎండ ఆణ్‌గళ్' (నా మగవారు) డాక్యుమెంటరీ గ్రంథాన్ని చక్కటి తమిళంలో అనువదించినందుకుగాను సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపికయ్యారు. విమలకు సాహిత్య అకాడమీ అవార్డు ప్రకటించడంతో తిరునెల్వేలి విద్యాసాహిత్యాభివృద్ధికి గుర్తింపు లభిస్తుందని స్థానిక రచయితలు పేర్కొన్నారు. కాగా అవార్డు కింద రూ.లక్ష నగదుతోపాటూ ప్రశంసాపత్రం అందించనున్నారు.

మూడు వాహనాలు ఢీకొని ముగ్గురి మృతి

● ఐదుగురికి తీవ్రగాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన వాహనాలు

టి.నగర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లా నమణసముద్రం సమీపంలో తిరుచ్చి - కారైక్కుడి జాతీయ రహదారిలో శనివారం ఉదయం రెండు కార్లు, సరకుల వ్యాన్ వరుసగా ఢీకొనడంతో ముగ్గురు దుర్మరణం చెందారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సమాచారం అందుకున్న సడలక్కలై పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. గాయపడిన ఐదుగురిని పుదుకోట ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో మృతి చెందినవారి వివరాలను వారు ప్రయాణించిన కారు నెంబర్ ఆధారంగా గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

సమాచార దర్శిని

నేడు సబర్బన్ రైళ్ల రద్దు ప్రత్యేక బస్సులు నడపనున్న ఎంటీసీ

పెరంబూర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): చెన్నై బీచ్-ఎగ్మూర్ మధ్య నాల్గవ రైలు మార్గం పనుల కారణంగా ఆదివారం తెల్లవారుజామున 5.10 నుంచి సాయంత్రం 4.10 గంటలకు వరకు చెన్నై బీచ్-తాంబరం-చెంగల్పట్టు-కాంచీపురం సబర్బన్ రైళ్లు రద్దు చేస్తున్నట్లు చెన్నై రైల్వే డివిజన్ కార్యాలయం తెలిపింది. సబర్బన్ రైళ్లు రద్దు కారణంగా ప్రజల సౌకర్యార్థం 50 అదనపు బస్సులు నడుపుతున్నట్లు మెట్రోట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) ప్రకటించింది. ఆ ప్రకారం, బ్రాడ్‌వే-తాంబరం మధ్య 25 బస్సులు, బ్రాడ్‌వే-కిలాంబాక్కం మధ్య 20 బస్సులు, పల్లావరం-చెంగల్పట్టు మధ్య 4 ప్రత్యేక బస్సులు కలిపి మొత్తం 50 బస్సులు నడుపనున్నట్లు ఎంటీసీ తెలిపింది.

రేపు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు టోకెన్లు

పెరంబూర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సోమవారం (ఈ నెల 10వ తేది) అదనపు టోకెన్లు అందించనున్నట్లు రిజిస్ట్రేషన్ శాఖ తెలియజేసింది. ఈ విషయమై ఆ శాఖ విడుదల చేసిన ప్రకటనలో... మాసి నెల శుభముహూర్తం రోజైన సోమవారం, ఒక సబ్ రిజిస్ట్రార్ ఉండే కార్యాలయాల్లో అందించే 100 టోకెన్లకు బదులు 150, ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు ఉండే కార్యాలయాల్లో 200 టోకెన్లకు బదులుగా 300 టోకెన్లు అందజేయనున్నామని తెలిపింది. అలాగే, 12గా అందిస్తున్న తత్కాల్ టోకెన్లకు అదనంగా 4 అందజేయనున్నట్లు రిజిస్ట్రేషన్ శాఖ తెలిపింది.

'టాన్సెట్', 'సీటా' హాల్ టిక్కెట్ల విడుదల

పెరంబూర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): టాన్సెట్, సీటా హాల్ టిక్కెట్లు శనివారం విడుదలయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో చేరేందుకు టాన్సెట్ ప్రవేశ పరీక్ష, ఎంఈ, ఎంటెక్, ఎంఆర్క్, ఎం ప్లాన్ కోర్సుల్లో చేరేందుకు సీటా ప్రవేశ పరీక్ష ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. టాన్సెట్ ఎంసీఏ ప్రవేశ పరీక్ష ఈ నెల 22వ తేది నిర్వహించనుండగా, 10,287 మంది దరఖాస్తు చేసుకున్నారు. అలాగే, టాన్సెట్ ఎంబీఏ ఈ నెల 22న జరుగునుండగా, 22,806 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇక, సీటా ప్రవేశ పరీక్ష ఈ నెల 23వ తేది నిర్వహించనుండగా 5,208 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు www.tancet.annauniv.edu/tancet అనే వెబ్‌సైట్ నుంచి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మూడు పరీక్షలకు మొత్తం 38,301 మంది దరఖాస్తు చేసుకోగా, రాష్ట్రవ్యాప్తంగా 16 నగరాల్లో 42 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు అన్నా విశ్వవిద్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

నేడు డీఎంకే ఎంపీల సమావేశం

టి.నగర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ఎంపీల సమావేశం ఈనెల 9న ఆదివారం జరుగుతుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సీనియర్ మంత్రి దురై మురుగన్ తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన జారీ చేశారు. పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం త్రిభాషా విద్యావిధానాన్ని అమలు చేయడానికి చేస్తున్న ప్రయత్నాలు, వివిధ పథకాలకు నిధులు విడుదల చేయకుండా అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణని తీవ్రంగా ఖండించేలా డీఎంకే ఎంపీలు పాలకపక్షాన్ని ఎలా నిలదీయాలో ఈ సమావేశంలో వివరించనున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు అన్నా అరివాలయంలో జరిగే ఈ సమావేశానికి డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ అధ్యక్షత వహించనున్నారని తెలిపారు.

12న నిరసన సభలు..

నియోజకవర్గాల పునర్విభజన, హిందీని నిర్బంధంగా అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 12న నిరసన సభలు నిర్వహించనున్నట్లు డీఎంకే అధిష్ఠానం ప్రకటించింది. తిరువళ్లూరులో ఏర్పాటయ్యే సభలో ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రసంగించనున్నారు. గుడియాత్తం సభలో సీనియర్ మంత్రి దురైమురుగన్, తిరుచ్చి సభలో మంత్రి కేఎన్ నెహ్రూ, దిండుగల్ సభలో మంత్రి పెరియసామి పాల్గొని ప్రసంగించనున్నారు.

విశాఖపట్నం - బెంగళూరు ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్రం విశాఖపట్నం నుంచి చెన్నై పెరంబూర్ మీదుగా కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. నెం.08549 విశాఖపట్నం - బెంగళూరు ప్రత్యేక రైలు ఈ నెల 9, 16, 23 (ఆదివారం) తేదీల్లో విశాఖపట్నం నుంచి మధ్యాహ్నం 3.30 గంటలకు బయల్దేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.45 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. మరోమార్గంలో నెం.08550 బెంగళూరు - విశాఖపట్నం ప్రత్యేక రైలు ఈ నెల 10, 17, 24 (సోమవారం) తేదీల్లో బెంగళూరు నుంచి మధ్యాహ్నం 3.50 గంటలకు బయల్దేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

టీవీకే బ్యానర్‌పై చర్చ



టీవీకే ఏర్పాటుచేసిన బ్యానర్‌లో వ్యాఖ్యలు

వేలూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఆధ్వర్యంలో శనివారం మహిళలు, పిల్లలపై జరుగుతున్న అత్యాచారాలు, లైంగిక వేధింపులను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. వేలూరు ఈస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆందోళన వేదిక వెనుక భాగంలో నిలిపిన బ్యానర్‌లో వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి. WE STAND AGANST WOMEN HARASSMENT అనే దానికి బదులు WE STAND FOR WOMEN HARRASEMENT (మహిళల వేధింపులకు అండగా నిలుస్తాం) అని ముద్రించారు.


ఉపన్యసిస్తున్న సామవేదం - కార్యక్రమానికి హాజరైన తెలుగువారు

సమస్త దిక్కుల సారాంశమే విష్ణు సహస్రనామం

● బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

ప్యారీస్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సమస్త దిక్కుల సారాంశమే విష్ణు సహస్రనామం ప్రత్యేకత అని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ పేర్కొన్నారు. నగరంలోని శర్వాణి సంగీత సభ ట్రస్ట్ ఆధ్వర్యంలో టి.నగర్ వెంకటనారాయణ రోడ్డులో వున్న శృంగేరి భారతి విద్యాశ్రమం సహకారంతో 'విష్ణు సహస్రనామ సార వైభవం' ఆధ్యాత్మిక ప్రవచనం రెండవరోజు కార్యక్రమం శనివారం సాయంత్రం జ్యోతిప్రజ్వలనతో ప్రారంభమైంది. వాసుదేవ స్తుతితో ప్రవచనాన్ని ప్రారంభించిన సామవేదం సహస్రనామాలు జపించడం మహాభాగ్యమని, పరబ్రహ్మంలోని కీలక అంశాలు, విశిష్టతను చాటిచెప్పేది బ్రహ్మవిద్య అని ఉద్ఘాటించారు. సృష్టి, స్థితి, లయలకు అతీతమైన మహావిష్ణువుని విశ్వంలో చూడాలంటే నిత్యం దైవ చింతనలో గడపాలని, భక్తే ముక్తి మార్గమని తెలిపారు. నీలమేఘశ్యాముడు, మంగళకరమైన రూపం కలిగిన శ్రీమన్నారాయణుడ్ని భక్తిశ్రద్ధలతో స్మరించడం వల్ల జీవితం దేదీప్యమానంగా ఉంటుందని సామవేదం షణ్ముఖశర్మ ప్రవచించారు. ఈ కార్యక్రమంలో ముందుగా 5 గంటలకు జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చెన్నై విభాగం కళాకారులు విష్ణు సహస్రనామం పారాయణం చేశారు. అనంతరం ప్రముఖ నాట్యకళాకారిణి రవళి ప్రదర్శించిన భరతనాట్యం శ్రోతలను అలరించింది. చివరగా భక్తులందరికీ నిర్వాహకులు ప్రసాదాలు పంపిణీ చేశారు.


అతిథులను సత్కరిస్తున్న నిర్వాహకులు

ఘనంగా 'ఆంధ్ర భాషాభిరంజని' వార్షికోత్సవం

వాషర్‌మెన్‌పేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాంబరంలోని మద్రాస్ క్రైస్తవ కళాశాల తెలుగుశాఖ అనుబంధంగా వున్న 'ఆంధ్ర భాషాభిరంజని' 138వ వార్షికోత్సవం శనివారం కళాశాలలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తెలుగుశాఖ క్విజ్, వ్యాసరచన, వక్తృత్వం, రంగోలి, పాటల పోటీలు నిర్వహించగా, వివిధ కళాశాలలకు చెందిన 150 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన ముగింపు సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎంసీసీ పూర్వ విద్యార్థులు అమరేంద్రరెడ్డి మాట్లాడుతూ.. తాను మూడు రాష్ట్రాల్లో చదువుకున్నానని, కానీ తనకు క్రైస్తవ కళాశాల ఎంతో ఇచ్చిందన్నారు. తెలుగు ఆచార్యులు తన విద్యార్థులను మిత్రుల్లా చూసేవారని స్మరించుకుంటూ.. కళాశాలతో 30 సంవత్సరాల అనుబంధాన్ని వివరించారు. ఆత్మీయ అతిథిగా హాజరైన ఇంద్రగంటి మాధురి మాట్లాడుతూ.. శ్రీపురం యజ్ఞశేఖర్ మంచి ఆచార్యులని, స్నేహశీలి అని అభినందించారు. తమ కుటుంబంలో పదిమందికిపైగా ఎంసీసీలో చదివి ఉన్నతస్థితిలో ఉన్నామని, ఈ కళాశాలలో చదవడం అదృష్టమని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆంధ్ర భాషాభిరంజని సంఘం నిర్వాహకులు నలుగురు ప్రముఖులకు జీవిత సాఫల్య పురస్కారాలను ప్రదానం చేశారు. తాంబరం ఏసీ కామాక్షిరావు తెలుగు పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయులు గెడ్డం ఆదాము, కన్యకా పరమేశ్వరి మహిళా కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహనశ్రీ, సినీ నటుడు, డబ్బింగ్ కళాకారుడు, సంగీత విద్వాంసుడు ప్రవీణ్ చక్రవర్తి, ఎంసీసీ లెక్కల విభాగంలో ఆచార్యుడిగా పని చేసి పదవీ విరమణ చేయబోతున్న ఆచార్య జ్యోతిసలోమి జీవిత సాఫల్య పురస్కారాలు అందుకున్నవారిలో వున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి ఆచార్య యజ్ఞశేఖర్, కళాశాల ఆచార్యులు డాక్టర్ సెల్వరాజ్, డాక్టర్ కలపాటి జోషువా తదితరులు పాల్గొన్నారు. కళాశాలలో 55 ఏళ్ల క్రితం చదువుకున్న లలితా సుధాకర్ అతిథులను సత్కరించారు. సంఘ వార్షిక నివేదికను విద్యార్థి సంఘం నాయకుడు పడిగపాటి యశ్వంత్‌రెడ్డి చదవగా, సంఘ కార్యదర్శి పూర్వి వాగ్వల, కోశాధికారి రాజకుమార పుత్రిక తదితరులు నేతృత్వం వహించారు. వడింగాడు రాము వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

మహిళా స్వయం సహాయక బృందాలకు రూ.60 లక్షల రుణాలు


రుణాలు అందజేస్తున్న మంత్రి దురైమురుగన్

వేలూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడిలో మహిళా స్వయం సహాయక బృందాలకు రుణాలు అందించే కార్యక్రమం శనివారం జరిగింది. కార్యక్రమానికి కలెక్టర్ సుబ్బులక్ష్మి అధ్యక్షత వహించగా, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి దురైమురుగన్ పాల్గొని, 25 స్వయం సహాయక బృందాలకు రూ.60 లక్షల రుణాలు అందజేశారు. కార్యక్రమంలో వేలూరు ఎంపీ కదిర్ ఆనంద్, వేలూరు ఎమ్మెల్యే కార్తికేయన్, జిల్లా పంచాయతీల అధ్యక్షుడు బాబు, వేలూరు కార్పొరేషన్ ఉప మేయర్ సునీల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ మ్యూజియం పరిశీలన


తవ్వకాల్లో బయల్పడిన కూజాను పరిశీలిస్తున్న మణివాచగమ్

వేలూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోటలో ఉన్న ప్రభుత్వ మ్యూజియాన్ని పర్యాటక శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి మణివాచగమ్ శనివారం పరిశీలించారు. మ్యూజియంలోని పలు అరుదైన వస్తువులు పరిశీలించిన ఆయన, వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కలెక్టర్ సుబ్బులక్ష్మి, పీడబ్ల్యూడీ నిర్వాహ ఇంజనీర్ సేడాన్, మ్యూజియం అధికారి శవరణన్, ప్రభుత్వ మ్యూజియం ఉద్యోగులు ఉన్నారు.

మేకేదాటు డ్యాం నిర్మాణం అసాధ్యం

● మంత్రి దురై మురుగన్

ప్యారీస్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసిన మేకేదాటు డ్యాం నిర్మాణం అసాధ్యమేనని రాష్ట్రమంత్రి దురైమురుగన్ పేర్కొన్నారు. తమిళనాడు, కర్ణాటక ప్రభుత్వాల మధ్య కావేరి జలాల పంపిణీకి సంబంధించి కుదుర్చుకున్న ఒప్పందం మేరకు ఎడాదికి రాష్ట్రానికి జలాలు పంపిణీ చేయకుండా నిర్లక్ష్యం చూపడం కర్ణాటక ప్రభుత్వానికి ఆనవాయితీగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దుల్లో వున్న మేకేదాటు వద్ద కొత్త డ్యాం నిర్మించేందుకు కర్ణాటక ప్రభుత్వం కొన్నేళ్ల క్రితం పథకం రూపొందించిందన్నారు మేకేదాటు నుంచి బెంగుళూరుకు జలాలు తరలించడానికి రాష్ట్రప్రభుత్వం అభ్యంతరం తెలియజేసినప్పటికీ కర్ణాటక ప్రభుత్వం డ్యాం నిర్మాణానికి ముందస్తు పనులను పూర్తి చేసినట్లు కర్ణాటక అసెంబ్లీ సమావేశంలో ముఖ్యమంత్రి సిద్ధారామయ్య ప్రకటించారన్నారు.

తిరుచెందూర్‌కు పోటెత్తిన భక్తులు

ప్యారీస్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శివపార్వతుల అనుంగు పుత్రుడు సుబ్రహ్మణ్యస్వామి కొలువుదీరిన ఆరు ప్రధాన క్షేత్రాల్లో రెండోదైన తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్ ఆలయంలో మాసి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈనెల 3వ తేదీ ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం కేరళ రాష్ట్రానికి చెందిన భక్తులు వివిధ రకాల కావళ్లు మోసుకుంటూ పాదయాత్రగా తిరుచెందూర్‌కు పెద్దసంఖ్యలో వచ్చారు. మరోవైపు శని, ఆదివారాలు సెలవు రోజులు కావడంతో భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఆలయ యాజమాన్యం క్యూలైన్లతో సుమారు ఐదు గంటలు వేచి వున్న భక్తులను దర్శనానికి అనుమతించింది. తిరుచెందూర్ సముద్రతీరంలో స్థానిక పోలీసులు సముద్రంలో స్నానాలకు వెళ్ళే భక్తులకు రక్షణ కల్పిస్తున్నారు. 50మందికి పైగా గజ ఈత గాళ్లను కూడా సిద్ధంగా వుంచారు.

గ్లెనీగల్స్‌లో 'హోమ్‌కేర్ సేవలు'



హోమ్‌కేర్ సేవలు ప్రారంభిస్తున్న నటి నళిని

వాషర్‌మెన్‌పేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): చెన్నైలోని ప్రముఖ ఆరోగ్య సంరక్షణా సంస్థల్లో ఒకటైన గ్లెనీగల్స్ హాస్పిటల్స్ నగరంలోని రోగులకు వారి ఇళ్లలోనే సేవలందించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు 'హోం కేర్' పేరుతో శనివారం సేవలను ప్రారంభించింది. ప్రముఖ సినీ నటి నళిని ఈ సేవలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ అశ్విన్ కరుప్పన్, గ్లెనీగల్స్ హాస్పిటల్ చెన్నై, హైదరాబాద్ క్లస్టర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ నాగేశ్వరరావు తదితరులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. అనారోగ్యం, శస్త్రచికిత్స లేదా దీర్ఘకాలిక ఆరోగ్య పరిస్థితుల నుంచి కోలుకుంటున్న వ్యక్తుల జీవన నాణ్యతను మెరుగుపరచడం, గృహ సంరక్షణ సేవల లక్ష్యమని పేర్కొన్నారు. ఇంటివద్దే ఆరోగ్య సంరక్షణ అవసరం పెరుగుతోందని, ప్రజలు తమ ఇళ్ల నుంచి ఆసుపత్రికి సుదూర ప్రయాణం చేయాల్సిన అవసరం లేకుండా వారి ఇంటివద్దనే ఉత్తమ సంరక్షణ పొందగలరని వివరించారు.

వాకథాన్‌కు విశేష స్పందన



వాషర్‌మెన్‌పేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసెంట్‌నగర్‌లోని ఆల్కాట్ స్కూల్ సమీపంలో హావీ పింక్ స్టోర్ ప్రైవేట్ లిమిటెడ్, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ శనివారం సంయుక్తంగా వాకథాన్ నిర్వహించాయి. మహిళా దినోత్సవం సందర్భంగా శ్రీ లలితాంబికా మెడికల్ కాలేజీ హాస్పిటల్ తరపున రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన ఈ వాకథాన్‌కు విశేష స్పందన లభించింది. ఐపీఎస్ అధికారి బాలకృష్ణన్ జెండా వూపి ప్రారంభించారు. ఈ సందర్భంగా 'హుమ్మర్' సంస్థ నుంచి ఐదు ప్రత్యేకమైన మహిళా ఆరోగ్య ఉత్పత్తులను వైద్య నిపుణులు లాంఛనంగా ఆవిష్కరించారు.

పోలీసు శాఖ ఆధ్వర్యంలో మారథాన్


మారథాన్ ప్రారంభిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం వేలూరు పోలీసు శాఖ తరపున మహిళల మారథాన్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి మారథాన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక గ్రీన్ సిగ్నల్ నుంచి ప్రారంభమైన మారథాన్, అన్నా ఆడిటోరియం వద్ద ముగిసింది. ఈ పోటీ విజేతలకు ఎస్పీ మదివానన్ బహుమతులు అందజేశారు. ఈ మారథాన్‌లో 500 మందికి పైగా విద్యార్థినులు పాల్గొన్నారు.

అధిక ఉప్పు వినియోగంతో బీపీ పెరుగుదల

... వైద్య నిపుణులు



సమావేశంలో వైద్య నిపుణులు

చెన్నై, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అధిక ఉప్పు వినియోగంతో రక్తపోటు పెరుగుతుందని, అందువల్ల ఉప్పు వినియోగం తగ్గించాలని వైద్య నిపుణులు సూచించారు. స్థానిక నందంబాక్కంలోని ట్రేడ్‌సెంటర్‌లో 'వరల్డ్ హైపర్‌టెన్షన్ లీగ్' నేతృత్వంలో శుక్రవారం ప్రారంభమైన అంతర్జాతీయ సదస్సులో 40 మంది అంతర్జాతీయ వైద్య నిపుణులు, 250 మంది దేశీయ వైద్య నిపుణులు పాల్గొని తమ అమూల్యమైన అభిప్రాయాలను వెల్లడించారు. దేశ జనాభాలో 32 శాతం మంది అధిక రక్తపోటుతో బాధపడుతున్నారని, దీన్ని నియంత్రించడం వైద్యులకు కూడా పెను సవాల్‌గా మారిందన్నారు. రోజుకు 8 గ్రాముల కంటే ఎక్కువ ఉప్పును వాడరాదని సూచించారు. ఈ అధిక రక్తపోటు గుండెపోటు, మూత్రపిండాల వైఫల్య ప్రమాదాన్ని పెంచుతుందని వరల్డ్ హైపర్‌టెన్షన్ లీగ్ ఇండియన్ ఆర్గనైజింగ్ కమిటీ ఉపాధ్యక్షుడు, ఎస్ఎస్ఎన్ స్పెషాలిటీస్ క్లినిక్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎన్ నరసింగన్ పేర్కొన్నారు. ఈ సదస్సు ప్రారంభోత్సవంలో డాక్టర్ రాజీవ్ గుప్తా, డాక్టర్ ఎస్.నరసింగన్, డాక్టర్ పాల్ కె వెల్టన్, డాక్టర్ జియాన్ ఫ్రాంకో పరాట్ తదితరులు కూడా పాల్గొన్నారు.

ఐల్యాండ్ గ్రౌండ్‌లో రూ.113కోట్లతో మ్యూజియం


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సీఎం స్టాలిన్

ప్యారీస్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఎండీఏ) ఆధ్వర్యంలో స్థానిక మెరీనా బీచ్ రోడ్డులో ఉన్న ఐల్యాండ్ గ్రౌండ్‌లో రూ.113కోట్లతో హైటెక్ వసతులతో మ్యూజియం నిర్మాణం పనులను సీఎం స్టాలిన్ పరిశీలించారు. సుమారు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటుకానున్న ఈ మ్యూజియం ప్రాంగణంలో 40 ప్రదర్శన శాలలు, ఆడిటోరియం, ఫుడ్ క్యాంటీన్లు, ఎనిమిది లిఫ్టులు, 200 ఆధునిక టాయిలెట్లు, వాహనాల పార్కింగ్ తదితర వసతులను సమకూర్చుతున్నారు. అంతేకాకుండా ఈ ప్రాంగణంలో ప్రభుత్వంలోని పలు శాఖల ఖర్చులను తగ్గించడంతో పాటు ప్రజలకు అవసరమైన అన్ని రకాల వసతులతో నిర్మితమవుతున్న ఈ మ్యూజియం పనులను ముఖ్యమంత్రి స్టాలిన్ పరిశీలించారు. ఆయన వెంట రాష్ట్రమంత్రులు కె.పొన్ముడి, పి.కె. శేఖర్‌బాబు, ప్రభుత్వ కార్యదర్శి కాకర్ల ఉషా, ఉన్నతాధికారులు అన్సుల్ మిశ్రా, సీఎండీఏ అధికారి శివజ్ఞానం, మేయర్ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

పళ్లిపట్టులో మహిళా దినోత్సవం


వేడుకల్లో అతిథులు, నిర్వాహకులు

తిరుత్తణి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా పళ్లిపట్టు సెయింట్ మేరీస్ మెట్రిక్ హయ్యర్ సెకండరీ స్కూలులో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ... మహిళలు లేనిదే మనుగడ లేదని, మహిళలే సృష్టికి మూలమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తంగమరి, ఉపాధ్యాయులు విశ్వనాతం, రజని, శాంతికుమారి, శ్రీదేవి, కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతుల బంధువుల ధర్నా


ఆందోళనకారులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

తిరుత్తణి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి సమీపంలో టిప్పర్ లారీ, ప్రభుత్వ బస్సు ఢీకొని నలుగురు చేనేత కార్మికులు మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుల కుటుంబాలకు తలా రూ.3 లక్షలు అందజేస్తున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో, మృతుల కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, అదనపు పరిహారం ఇవ్వాలని కోరుతూ శనివారం చేనేత కార్మికులు ప్రభుత్వాస్పత్రి వద్ద ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనలో పాల్గొన్న 200 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు.

ఘనంగా సెయింట్ మేరీస్ పాఠశాల వార్షికోత్సవం



వార్షికోత్సవంలో అతిథులు, నిర్వాహకులు

తిరుత్తణి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తిరుపత్తూర్ జిల్లా పొదటూరుపేట పట్టణంలోని సెయింట్ మేరీస్ మెట్రిక్యులేషన్ పాఠశాల 36 వార్షికోత్సవం శుక్రవారం సాయంత్రం ఘనంగా జరిగింది. వేడుకలకు ముఖ్యఅతిథులుగా రెవెన్యూ అధికారి ఎస్.రాము, ఆర్కే పేట ఎస్ఐ ఆంథోనిరాజ్, రెవరెండ్ ఆంథోనిస్వామిలు పాల్గొని, పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందర్నీ ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రిన్సిపాల్ అరుల్ జేవియర్ మైఖేల్, మణిమారన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కర్ణాటక సీఎంను ఆహ్వానించొద్దు

● సీఎంకు రాందాస్ వినతి

అడయార్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన వల్ల కలిగే లాభనష్టాలపై చర్చించేందుకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఏడు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆహ్వానం పలకగా, ఇందులో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కూడా ఉన్నారు. అయితే, రాష్ట్ర హక్కులను హరించే విధంగా వ్యవహరిస్తున్న కర్ణాటక సీఎం సిద్ధరామయ్యను ఈ సమావేశానికి ఆహ్వానించవద్దని పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ విజ్ఞప్తి చేశారు. అనుమతులు వచ్చిన వెంటనే కావేరీ నదిపై మెకెదాటు ఆనకట్ట నిర్మాణ పనులు ప్రారంభిస్తామని సిద్ధరామయ్య ప్రకటించారని, ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని మొండిగా చేపడితే రాష్ట్ర రైతాంగానికి అపారనష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల లోక్‌సభ నియోజకవర్గాల పునర్ విభజన అంశంపై చర్చించేందుకు సీఎం స్టాలిన్ ఏర్పాటు చేసే సమావేశానికి సిద్ధరామయ్యను ఆహ్వానించవద్దని రాందాస్ శనివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

ఏర్కాడు వద్ద టూరిస్ట్ వ్యాన్ బోల్తా

● 12 మంది చెన్నైవాసులకు గాయాలు



పెరంబూర్, మార్చి 8 (ఆంధ్ర జ్యోతి): సేలం జిల్లా ఏర్కాడులో వ్యాన్ బోల్తాపడిన ఘటనలో చెన్నైకి చెందిన 12 మందికి గాయాల య్యాయి. నగరానికి చెందిన ఐటీ సం స్థలో పనిచేస్తున్న ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలు, ఇద్దరు పిల్లలు ఏర్కాడు విహారయాత్రకు బస్సు లో వెళ్లారు. అస్తంపట్టిలో బస్సు దిగి, అక్కడి నుంచి ఏర్కాడుకు టూరిస్ట్ వ్యాన్ అద్దెకు తీసుకొని బయల్దేరారు. వ్యాన్‌ను అస్తంపట్టికి చెందిన శాంత కుమార్ నడుపుతున్నాడు. శనివారం ఉదయం కొండ మార్గంలోని 40 అడు గుల వంతెన మార్గంలో వెళ్తున్న బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. చుట్టుపక్కలవారు వ్యాన్ నుంచి క్షతగాత్రులను రక్షించి 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

'చెన్నై పెన్ షో' ప్రారంభం


ప్రదర్శనలో గౌతమ్ వాసుదేవ్ మీనన్ తదితరులు

చెన్నై, మార్చి 8 (ఆంధ్ర జ్యోతి): స్థానిక అడయార్‌లోని ఫోర్టిస్ మలర్ హాస్పిటల్ సమీపంలో ఉన్న 'ఫికా'లో ఏర్పాటైన 'చెన్నై పెన్ షో'ను సినీ దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మీనన్, సీనియర్ ఐపీఎస్ అధికారి కె.వన్నియ పెరుమాళ్, రచయిత్రి కృష్ణ త్రిలోక్ తదితరులు శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ ప్రదర్శన ఆదివారం వరకు కొనసాగనుంది. ఈ ప్రదర్శన ప్రపంచంలోనే అతి పెద్ద షోగా రికార్డులకెక్కనుంది. 45 మందికి పైగా ఎగ్జిబిటర్లు జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లు, ప్రత్యేకమైన షోకేస్‌లతో ఈ ప్రదర్శన ప్రత్యేక అనుభూతిని కలిగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శన ప్రవేశ రుసుము ఉచితమే.



జీఎస్టీ రోడ్డుకు ఎడమవైపు కృత్రిమంగా నిర్మించిన దీవి

● ప్రత్యేక ఆకర్షణగా రెట్టేరి జలాశయం
● నాలుగు కృత్రిమ దీవులు ● బోట్ సవారీ, ఉద్యానవనాలు

SUNDAY SPECIAL



రెట్టేరి చెరువు విహంగ వీక్షణం



పచ్చని చెట్లతో చిట్టడవిని తలపిస్తున్న కృత్రిమ దీవి

చెన్నైలో మరో పర్యాటక ప్రాంతం

రాజధాని నగరం చెన్నైలో రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు సరిపడా మంచినీటిని సరఫరా చేయడం ప్రభుత్వానికి సవాలుగా పరిణమిస్తోంది. నిర్లవణీకరణ ప్లాంట్ల ద్వారా కొన్ని ప్రాంతాలకు మంచినీటిని సరఫరా చేస్తున్నప్పటికీ నగరవాసులు ప్రకృతి సిద్ధంగా జలాశయాల ద్వారా సరఫరా అయ్యే నీటిపైనే ఆసక్తికనబరుస్తున్నారు. ఆ దిశగా చెన్నై మహానగర అభివృద్ధి సంస్థ (సీఎండీఏ), గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రెడ్‌హిల్స్ సమీపంలో జాతీయ రహదారికి కుడి, ఎడమవైపులా వ్యాపించి ఉన్న రెట్టేరిని తాగునీరు అందించే జలాశయం, నగరవాసులు సందర్శించే పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతున్నారు. రూ.43.19 కోట్లతో ఈ మెగా ప్రాజెక్టు ఈ యేడాది మే నెలాఖరులోగా పూర్తి చేయనున్నారు.

- టి.నగర్, ఆంధ్రజ్యోతి

జయ హయాంలోనే శ్రీకారం...

నగరంలోని ముఖ్యమైన జలాశయాల్లో రెట్టేరి చెరువు ఒకటి. 400 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ చెరువును పర్యాటక ప్రాంతంగా మార్చేందుకు సీఎంగా జయలలిత హయాంలోనే రూ.20 కోట్లు కేటాయించారు. 2015లో మార్చిలో ఈ చెరువు మరమ్మతులు ప్రారంభమై అర్ధంతరంగా ఆగిపోయాయి. ఈ నేపథ్యంలో66 మండు వేసవిలోనూ జలకళతో ఉండే ఈ చెరువు రూపు రేఖలు పూర్తిగా మారనున్నాయి. 2019లో నగరంలో తీవ్ర మంచినీటి యెద్దడి ఏర్పడినప్పుడు నీటిసరఫరా అధికారులు ఆ చెరువు నుండే భారీ మోటరు పంపుల ద్వారా నీటిని సరఫరా చేసి కొరతను వరకు తీర్చగలిగారు. ఆ చెరువు వల్ల పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరుగుతోందని కూడా అధికారులు నిర్ధరించారు. ఈ పరిస్థితులలో ఈ రెట్టేరి జలాశయాన్ని ప్రముఖ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దటానికి రూ.43.19 కోట్లతో పనులు చేపడుతున్నారు. ఆ చెరువులో 7 లక్షల ఘనపు మీటర్ల పరిమాణంలో మట్టిని తొలగించారు. దీంతో చెరువు సామర్థ్యం 32 మిలియన్ ఘనపుటడుగుల నుంచి 45.13 మిలియన్ ఘనపుటడుగులకు పెరగనుంది. ఈ కొత్త ప్రాజెక్టు కింద మాధవరం తాలూకాలోని మాధవరం చెరువు కరకట్టలను పటిష్ఠం చేయనున్నారు. రెట్టేరి జలాశయం పూడికతీత పనులు కూడా ఇటీవలే ముగిశాయి. గ్రాండ్ నార్తన్ ట్రంక్ (జీఎన్టీ) రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెరువు గట్లను పటిష్ఠం చేశారు. ప్రస్తుతం ఆ చెరువులో పర్యాటకులను ఆకట్టుకునే రీతిలో నాలుగు చోట్ల కృత్రిమ దీవులను రూపొందించే పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ దీవులకు వెళ్లేందుకు పడవల సవారీ సదుపాయం కూడా కల్పించనున్నారు. అదే సమయంలో అక్కడక్కడా వాటర్ ఫౌంటైన్లు కూడా నిర్మించనున్నారు. రోజూ ఉదయం వాకింగ్‌కు వెళ్లేవారి కోసం ప్రత్యేంగా ట్రాక్‌ను, వ్యాయామశాలను, సీనియర్ సిటిజన్లు సేదతీరటానికి అనువైన నీడనిచ్చే అంబ్రెల్లా సైట్‌లు ఏర్పాటు చేస్తున్నారు. అన్నిహంగులు పూర్తి చేసుకుని రానున్న మే నెలాఖరులోగా ఈ చెరువు శుభ్రమైన తాగునీటిని అందించే జలాశయంగా నగరవాసులకు సందర్శనీయమైన ప్రముఖ పర్యాటక ప్రాంతంగా మారనుంది.



ఇరువైపులా ఆక్రమణలు తొలగించడంతో వెడల్పు పెరిగిన రెట్టేరి చెరువు



ఇళయరాజాతో రజనీకాంత్

సామీ... నిన్ను చూసి దేశమే గర్విస్తోంది

● ఇళయరాజాకు రజనీకాంత్ శుభాకాంక్షలు

చెన్నై, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): 'సామీ... నిన్ను చూసి భారతదేశమే గర్విస్తోంది' అంటూ ప్రముఖ సంగీత దర్శకుడు, ఇసైజ్ఞాని ఇళయరాజాకు సూపర్ స్టార్ రజనీకాంత్ శుభాకాంక్షలు తెలిపారు. ఇళయరాజా స్వరపరిచిన తొలి సింఫోని కచ్చేరి లండన్‌లోని అపోలో ఎరీనాలో శనివారం రాత్రి జరిగింది. ఈ అరుదైన ఘట్టాన్ని పురస్కరించుకుని ఇళయరాజాకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌తో పాటు పలువురు సినీ రాజకీయ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ నేపథ్యంలో తాజాగా ఇళయరాజాకు రజనీకాంత్ శనివారం తన ఎక్స్ వేదిక ద్వారా శుభాకాంక్షలు చెప్పారు. ఈ మేరకు ఆయన ఎక్స్ ఖాతాలో ఓ పోస్ట్ చేశారు. 'పన్నాపురంలో హార్మోనియం వాయించిన చేతులు ఇప్పుడు లండన్‌లో సింఫోనీని సృష్టిస్తున్నాయి. 'సామీ.. నిన్ను చూసి భారతదేశమే గర్విస్తోంది' అంటూ పోస్ట్ చేస్తూ 'ఇన్‌క్రెడిబుల్ ఇళయరాజా' అనే హ్యాష్ ట్యాగ్‌ను జత చేశారు. కాగా, ఇళయరాజా స్వయంగా స్వరపరిచిన తన తొలి సింఫోని 'వలియంట్'ను లండన్ కాలమానం ప్రకారం శనివారం రాత్రి 7 గంటలకు, భారతకాలమానం ప్రకారం 9వ తేదీ ఆదివారం ఉదయం ఒంటిగంట (శనివారం రాత్రి ఒంటిగంట)కు ప్రదర్శించనున్నారు.

భరత్ హీరోగా 'కాళిదాస్-2'

● ఫస్ట్‌లుక్ విడుదల

నటుడు భరత్, కొత్త నటుడు అజయ్‌కార్తీక్ కలిసి తొలిసారి నటించిన చిత్రం 'కాళిదాస్-2'. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను ప్రముఖ నటుడు 'మక్కల్ సెల్వన్' విజయ్ సేతుపతి శనివారం తన ఎక్స్ ఖాతా వేదికగా విడదల చేసి, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. 2019లో భరత్ హీరోగా వచ్చిన ఈ సినిమా తొలిభాగం ఇటు విమర్శనాత్మకంగా అటు వాణిజ్యపరంగా సక్సెస్‌ఫుల్‌గా నిలిచింది. శ్రీసెంథిల్ దర్శకుడు. ఈ మూవీలో కాళిదాస్, అజయ్ కార్తీక్, ప్రకాష్‌రాజ్, సురేష్ మేనన్, అనంత్ నాగ్, భవానీ శ్రీ, అపర్నతి, రాజా శ్రీధర్ తదితరులు నటించారు. 'పూవే ఉనక్కాగ'లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపును, క్రేజ్‌ను సొంతం చేసుకున్న నటి సంగీత... ఈ చిత్రంలో ముఖ్య పాత్రను పోషించి, తమిళంలో మళ్లీ రీఎంట్రీ ఇస్తున్నారు. సురేష్ బాల ఛాయాగ్రహణం అందించే ఈ మూవీకి శ్యామ్ సీఎస్ సంగీతం. క్రైం థ్రిల్లర్‌గా రూపొందుతోన్న ఈ చిత్రాన్ని ప్రముఖ సినీ పంపిణీదారుడు, నిర్మాత ఫైవ్‌స్టార్ సెంథిల్ తన సొంత నిర్మాణ సంస్థ స్కై పిక్చర్స్ పతాకంపై నిర్మించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకోగా, నిర్మాణాంతర కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో చిత్రం ఫస్ట్‌లుక్‌ను విజయ్ సేతుపతితో విడుదల చేయించారు. ఈ సినిమా వివరాలను దర్శకుడు వివరిస్తూ.. 'అభిమానులు, ప్రేక్షకుల ఆదరణతో కాళిదాస్ తొలిభాగం సూపర్‌హిట్‌గా నిలిచింది. తొలిభాగం విజయంతోనే రెండో భాగాన్ని క్రైం థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కిస్తున్నాం. ఈ సినిమా షూటింగ్ చెన్నై, కేరళలో చేశాం. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుందనడంలో సందేహం లేదు. వేసవి సెలవుల్లో విడుదల చేయాలని సన్నాహాలు చేస్తున్నాం' అని వివరించారు.



'కాళిదాస్-2' ఫస్ట్‌లుక్





ధృవ్ విక్రమ్ 'బైసన్' చిత్రీకరణ పూర్తి

'వాళై' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత డైరెక్టర్ మారి సెల్వరాజ్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'బైసన్'. ధృవ్ విక్రమ్ హీరో. అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్. కబడ్డీ క్రీడా నేపథ్యంలో రూపొందుతోంది. చిత్రీకరణ పనులన్నీ పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను తాజాగా విడుదల చేశారు. ఇందులో ధృవ్ విక్రమ్ కబడ్డీ ఆటగాడిగా ట్రాన్స్‌ఫార్మేటివ్ పాత్రలో కనిపించనున్నారు.సమాజంలో జరిగిన కొన్ని వాస్తవిక సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇతర పాత్రల్లో లాల్, పశుపతి, కలై యరసన్, రజీషా విజయన్, హరికృష్ణన్, అలగం పెరుమాళ్ తదితరులు నటించారు.నివాస్ కె.ప్రసన్న సంగీతం. అప్లాజ్ ఎంటర్‌టైన్మెంట్, పా.రంజిత్‌కు చెందిన నీలం స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని రూపొందించాయి.

తమిళ చిత్రజ్యోతి

హారర్ - థ్రిల్లర్ - సూపర్ నేచురల్ మూవీగా 'కింగ్‌స్టన్'

ఒకే కథలో హారర్, థ్రిల్లర్, సూపర్ నేచురల్ వంటి ఎన్నో జానర్లను మిక్స్ చేసి అద్భుతంగా తెరకెక్కించిన చిత్రం 'కింగ్‌స్టన్'. జీవీ ప్రకాష్‌కుమార్ హీరోగా నటించి, సొంతంగా నిర్మించారు. నిర్మాతగా తొలి చిత్రం. దివ్యభారతి హీరోయిన్. డెబ్యూ డైరెక్టర్ కమల్ ప్రకాష్ దర్శకత్వం వహించారు. గోకుల్ బినోయ్ ఛాయాగ్రహణం అందించగా, జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం. గ్రేట్ సీ అడ్వెంచర్ థ్రిల్లర్‌గా రూపొందించారు. తూత్తుక్కుడి జిల్లాలోని తూవత్తూరు అనే జాలరి గ్రామానికి చెందిన ప్రజలు సముద్రంలో చేపల వేటకు వెళ్లడం మానేస్తారు. దీనికి కారణం వారు వేటకు వెళ్లే సముద్ర ప్రాంతాన్ని శాపగ్రస్త భాగంగా ప్రకటించడమే. అప్పటికీ ఎవరైనా సాహసం చేసి ఆ ప్రాంతానికి వెళితే వారి మృతదేహాలు తీరానికి కొట్టుకుని వచ్చేవి. 1982లో చనిపోయిన బోస్ అనే జాలరి ఆత్మ ఇదంతా చేస్తుందని ఆ గ్రామ ప్రజల నమ్మకం. గ్రామంలోని పెళ్లీడుకొచ్చిన యువతులు కూడా మాయమవుతుంటారు. ఈ సంఘటనలకు కారణం ఎవరు? ఇందులో బెస్తకారుడుగా నటించిన జీవీ ప్రకాష్.. ఈ మరణాల వెనుక ఉన్న మరణాన్ని ఛేదించారా? లేదా? అన్నది ఈ చిత్ర కథ. సముద్రంలో జరిగే అతీంద్రియ శక్తుల సన్నివేశాలు, సాహసాలను ఎంతో అందంగా చిత్రీకరించారు. ఈ సన్నివేశాలు సహజంగా ప్రేక్షకుడిని ఉత్కంఠకు గురిచేసేలా ఉన్నాయి. ఈ సినిమాలో లొకేషన్లు, గ్రాఫిక్స్, విజువల్స్, నేపథ్య సంగీతం అద్భుతంగా ఉన్నాయి.



'కింగ్‌స్టన్'లో జీవీ ప్రకాష్ కుమార్, దివ్యభారతి

ఆ ముద్ర నుంచి బయటపడేందుకే వెబ్‌సిరీస్

● నటి సోనా

సినిమా ఇండస్ట్రీలో తనకు శృంగార తార అనే ముద్ర ఉందనీ, దాన్నుంచి బయటపడేందుకు స్వయంగా వెబ్ సిరీస్‌ను రూపొందించినట్లు నటి సోనా వెల్లడించారు. తన జీవితంలో 2010-15 మధ్య జరిగిన అనేక సంఘటన సమాహారంగా 'స్మోక్' పేరుతో వెబ్ సిరీస్‌ను ఆమె నిర్మించి, దర్శకత్వం వహించారు. మొత్తం 8 ఎపిసోడ్లు కలిగిన ఈ వెబ్ సిరీస్ షార్ట్ ఫ్లిక్స్ అనే ఓటీటీలో త్వరలో స్ట్రీమింగ్ కానుంది. ఇదే అంశంపై సోనా మాట్లాడుతూ... ఒక్కో ఎపిసోడ్ అరగంట పాటు సాగుతుంది. 2010-15 మధ్య కాలంలో నా జీవితంలో జరిగిన సంఘటనలు ప్రధానంగా చేసుకుని తెరకెక్కించా. ఈ వెబ్‌సిరీస్ తీయకుండా అనేక మంది అడ్డుపడ్డారు. పలు రకాలుగా ఇబ్బందులు సృష్టించారు. ఆర్థికంగా మోసం చేశారు. ఇలాంటివన్నీ ఒంటరిగా ఎదుర్కొన్నా. ఏ ఒక్కరిపైనో పగ, ప్రతీకారం తీర్చుకోవాలని ఈ సిరీస్ నిర్మించలేదు. నాకు శృంగార తార అనే ముద్ర ఉంది. దీని నుంచి బయటపడేందుకే రూపొందించా. గ్లామర్ పాత్రల కోసం చాలా మంది సంప్రదిస్తున్నారు. కానీ, ఇకపై అలాంటి పాత్రలు చేయరాదని నిర్ణయించుకున్నాను. మంచి పాత్రల్లోనే నటిస్తాను' అని పేర్కొన్నారు.

ఘనంగా సీబీఎఫ్ స్త్రీల సమాజం వార్షికోత్సవం



జడ విశ్వవాణిని జ్ఞాపికతో సత్కరిస్తున్న తెలుగు మహిళలు

ప్యారీస్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొరుక్కుపేట, కామరాజర్ నగర్‌లోని క్రిస్టియన్ బిలీవర్స్ ఫెలోషిప్ (సీబీఎఫ్) స్త్రీల సమాజం 18వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఎస్తేర్ ప్రేయర్ వారియర్స్, డెబోరా విమెన్, యూత్ ఫెలోషిప్ విభాగాలకు చెందిన మహిళలు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. దైవజనురాలు జడ విశ్వవాణి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ... కుటుంబం, సంఘం, సమాజంలో స్త్రీ పాత్ర చాలా కీలకమైనదన్నారు. కార్యక్రమంలో సీబీఎఫ్ నాట్యకళా మండలి సభ్యులు డాక్టర్ జడ వసంత్‌బాబు రచించి దర్శకత్వం వహించిన 'తల్లి ప్రేమ' అనే నాటికను ప్రదర్శించారు. చివరగా పలు పోటీల్లో విజేతలకు జడ బెస్సీ సెరప్ బహుమతులు ప్రదానం చేశారు.

వీఐటీ యూనివర్శిటీలో మహిళా దినోత్సవం

వేలూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీఐటీ యూనివర్శిటీలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు నిర్వహించారు. విద్యార్థి సంఘం అధ్యక్షులు ఇస్మిరుదికుమారి ఆహ్వానం పలుకగా, వర్శిటీ ఉపాధ్యక్షుడు శంకర్ అధ్యక్షత వహించారు. వర్శిటీ ఛాన్సలర్ విశ్వనాథన్ వేడుకలు ప్రారంభించి మాట్లాడుతూ.. ప్రపంచంలోనే మొదటి మహిళా ప్రధాన మంత్రిగా శ్రీలంకలో సిరిమావో భండారు నాయకే, రెండో ప్రధాన మంత్రిగా భారత్‌లో ఇందిరా గాంధీ, 3వ ప్రధాన మంత్రిగా ఇజ్రాయేల్‌లో గోల్డ్‌మేయర్ పదవులు చేపట్టారన్నారు. దేశ రాజకీయాల్లో ఇందిరా గాంధీ, తమిళనాడు సీఎంగా జయలలిత శక్తివంతమైన మహిళలుగా నిలిచార న్నారు. అదే సమయంలో మహిళలు రాజకీయాల్లోకి రావడం తక్కువగా ఉందన్నారు. ప్రపంచంలో 10 దేశాల్లో 50 శాతం మహిళా ఎంపీలుండగా, దేశంలో 16 శాతంగా ఉన్నారన్నారు. దేశంలో 500 పెద్ద కంపెనీల్లో 9 కంపెనీల్లో మాత్రమే మహిళలు ఛైర్మన్లుగా ఉన్నారన్నారు. మహిళలు ఉన్నత విద్య అభ్యసిస్తే ఈ పరిస్థితి మారుతుందన్నారు. వేడుక లకు ముఖ్యఅతిథిగా మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి భవాని సుబ్బురాయన్ పాల్గొన్నారు. కార్యక మంలో వర్శిటీ అధ్యక్షుడు శేఖర్, వీఐటీ మేనేజింగ్ డైరెక్టర్ సంధ్యా పెండారెడ్డి, వైస్, ప్రొ ఛాన్సలర్ పార్థసారథి, రిజిస్ట్రార్ జయభారతి, వైస్ ఛాన్సలర్ కాంచన, సన్‌సన్ సెక్యూరిటీ సంస్థ జాయింట్ డైరెక్టర్ వందన జైన్ సహా పలువురు పాల్గొ న్నారు. ఈ వేడుకల్లో మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు ఛాన్సలర్ విశ్వనాథన్ బహుమతులు అందజేశారు. విద్యార్థుల సంఘ అసిస్టెంట్ డైరెక్టర్ వరలక్ష్మి వందన సమర్పణతో వేడుకలు ముగిశాయి.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఛాన్సలర్ విశ్వనాథన్

మహిళలు స్వతంత్రంగా జీవించాలి

ప్యారీస్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా బలపడి స్వతంత్రంగా జీవించినప్పుడే సమాజంలో తగిన గుర్తింపు ఉంటుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రిలోని క్రైస్ట్ వర్షిప్ సెంటర్ డైరెక్టర్, టీవీ సువార్త ప్రసంగికురాలు బెస్సీ జాన్ వెస్లీ అన్నారు. స్థానిక పెరంబూరు కుక్స్ రోడ్డులోవున్న వాటర్‌బరి మెమోరియల్ తెలుగు బాప్టిస్టు సంఘం (డబ్ల్యూ ఎంటీబీసీ) స్త్రీల సమాజం ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. అధ్యక్షురాలు సంపూర్ణ పుల్లా (బిందు), ఉపాధ్యక్షురాలు ఎస్‌టీ. విజయభాస్కర్, కార్యదర్శి కే.రీటా ప్రభాకర్, ఉప కార్యదర్శి వి.ప్రభావతి నాగేశ్వరరావు, ట్రెజరర్ కే.రాణి సురేష్, కమిటీ సభ్యులు ముఖ్య అతిథి బెస్సీ జాన్ వెస్లీని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ సీనియర్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ ఎం.పాల్ ఈశ్వరప్ప, అసిస్టెంట్ పాస్టర్లు ఆరోన్‌దయాన్, పి.మదన్ మోహన్ సహా సంఘ ప్రధాన నిర్వాహకులు, మహిళలు పాల్గొన్నారు.





రాజమండ్రికి చెందిన టీవీ సువార్త ప్రసంగీకురాలు బెస్లీ జాన్ వెస్లీని మెమెంటోతో సత్కరిస్తున్న డబ్ల్యూఎంటీబీసీ స్త్రీల సమాజం నిర్వాహకులు - హాజరైన మహిళా సభ్యులు



మహిళా దినోత్సవంలో ప్రసంగిస్తున్న షేకినా గ్లోరి

మహిళలే సమాజ ప్రగతికి వెలుగు దివ్వెలు

● హైదరాబాద్ సువార్త ప్రసంగీకురాలు షేకినా గ్లోరి

ప్యారీస్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళలే సమాజ ప్రగతికి వెలుగు దివ్వెలని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ టీవీ సువార్త ప్రసంగికురాలు షేకినా గ్లోరి అన్నారు. స్థానిక వెపేరిలోని మద్రాస్ సెంటినరీ తెలుగు బాప్టిస్టు సంఘం (ఎంసీటీబీసీ) స్త్రీల సమాజం ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘ కాపరి రెవరెండ్ డాక్టర్ ఎస్.రాజేంద్రప్రసాద్ ప్రార్థనతో ప్రారంభమైన ఈ వేడుకలకు స్త్రీల సమాజం అధ్యక్షురాలు ఎస్.దానమ్మ సారథ్యం వహించగా, కార్యదర్శి జీ.రూతమ్మ, ట్రెజరర్ ఎం.రాణి, సువార్తీకులు కే.దీనమ్మ, జె.జయమ్మ ఏర్పాట్ల పర్యవేక్షించారు. సంఘ అధ్యక్షులు జి.రామయ్య, కార్యదర్శి పోతల ప్రభదాస్, ట్రెజరర్ ఐ.మార్క్, ఇతర కమిటీల నిర్వాహకులు, మహిళలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన షేకినా గ్లోరి గ్రూప్ సింగింగ్, బైబిల్ క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు.



వేడుకల్లో పాల్గొన్న మహిళలు